సాక్షి
కాకినాడ

మంగళవారం । 8 । జూలై । 2025



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు సీవీ వాసుదేవ రాయ్, ఉషరాయ్ దంపతులు (హైదరాబాదు) రూ.1,01,116 విరాళం అందజేశారు.



అరుణాచల క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ

ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచల క్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. 63 మంది నాయనార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

8లో

కడలిలోకి 1,85,143 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ఉధృతి సోమవారం స్వల్పంగా తగ్గింది. బ్యారేజీ నుంచి 1,85,143 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 12,650 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.70 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

రత్నగిరిపై కొనసాగుతున్న భక్తుల అసంతృప్తి



వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం

అన్నవరం: సత్యదేవుని సన్నిధికి వస్తున్న భక్తుల్లో ఇంకా అసంతృప్తి కొనసాగుతున్నట్లు గత నెలలో ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. అయితే, మే నెలలో దాదాపు 35 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేయగా ఈసారి అది 25 శాతానికి పరిమితమైంది. మే 26 నుంచి జూన్ 25వ తేదీ వరకూ రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాల్లో భక్తులకు అందుతున్న సేవలపై ప్రభుత్వం సర్వే నిర్వహించింది. అన్నవరం దేవస్థానానికి వచ్చేసరికి సత్యదేవుని దర్శనం విషయంలో మే నెలలో 68 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయగా జూన్ నెలలో అది 73 శాతానికి పెరిగింది. మౌలిక వసతుల కల్పనలో మే నెలలో 61 శాతం మంది, జూన్‌లో 66 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. స్వామివారి గోధుమ నూక ప్రసాదం నాణ్యతపై మే నెలలో 78 శాతం మంది సంతృప్తి చెందగా జూన్‌లో అది 77 శాతంగా నమోదైంది. పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి మే నెలలో 64 శాతం, జూన్‌లో 70 శాతం మంది సంతృప్తి చెందారు.

ప్రత్యేకాధికారి నిర్ణయాలు అమలు చేయాలి

భక్తుల అసంతృప్తి తగ్గించడానికి దేవస్థానం ప్రత్యేకాధికారిగా దేవదాయ శాఖ రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాథరావును నియమించిన సంగతి తెలిసిందే. ఆయన గత నెల 24న అన్నవరం దేవస్థానానికి వచ్చి, ఈఓ వీర్ల సుబ్బారావుతో కలసి టాయిలెట్ల నిర్వహణను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా వీటిని నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, పాత మెయిన్ గెస్ట్ హౌస్ వెనుక శిథిలావస్థకు చేరిన టాయిలెట్లను కూల్చివేయాలని ఆదేశించారు. ఈ నిర్ణయాలు ఇంకా అమలు కాలేదు. మొత్తం మీద మే నెల కన్నా జూన్‌లో భక్తుల అసంతృప్తి శాతం 10 శాతం తగ్గిందని, ముందుముందు ఇంకా తగ్గేలా కృషి చేస్తామని దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు 627 అర్జీలు



అర్జీదారు సమస్య వింటున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై 627 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, డీఆర్ఓ జె.వెంకటరావు తదితరులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల్లో నమోదైన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.



తాండవ నదిపై తుని వద్ద నిర్మించిన మినీ ఆనకట్ట



ఏలేరు రిజర్వాయర్



ప్రగతి చిహ్నం.. రాజన్న సంతకం

- మహానేత జాడలు పదిలం
- జిల్లా అభివృద్ధిలో వైఎస్సార్‌ది కీలక భూమిక
- సాగునీటి ప్రాజెక్టులతో మెట్ట రైతుకు మేలు
- మెట్టకు వరమైన ఆ మహనీయుని దూరదృష్టి
- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అందరూ **'పెద్దాయన'**గా పిలుచుకునే దివంగత ముఖ్యమంత్రి **డాక్టర్ వైఎస్** రాజశేఖరరెడ్డి ఈ జిల్లాపై చేసిన స**ంతకం.. ప్రగతికి** ప్రతిబింబంగా నిలిచింది. జిల్లా **ప్రజల సంక్షేమం,** అభివృద్ధిలో ఆయన ముద్ర ఎప్పటి**కీ చెరగనిది. తన** దార్శనికతతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసిన మహానేత ఆయన. భౌతికంగా దూరమైనప్పటికీ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా రాజన్న చేసిన మేలును జిల్లా వాసులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటూనే ఉంటారు. పరిపాలనకు మానవత్వాన్ని జోడించిన ఘనత ఆయనదే. అందుకే ఆయన హఠాన్మరణంతో గుండెలవిసేలా రోదించి, మరణించిన వారి సంఖ్య ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే అధికం. మరణించి ఇన్నేళ్లయినా ప్రతి హృదయంలోనూ ఆయన ఇప్పటికీ కొలువై ఉన్నారు. నిఖార్సయిన రాజకీయాలతో అన్ని వర్గాల అభిమానాన్నీ పొందారు. రైతు పక్షపాతిగా జిల్లాలో ఆయన చేసిన సేవలు అజరామంగా నిలిచాయి.

2004కు ముందు నాటి చంద్రబాబు పాలనలో వర్షాలు కురిసి కనాకష్టం మీద ఒక పంట పండితే **చాలని అనుకునే దుస్థితి అప్పటి రైతులది. అటువంటి మెట్ట సీమలో నేడు రెండు పంటలు పండుతున్నాయంటే మహానేత వైఎస్సార్ ముందుచూపే కారణం. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి రాజానగరం మధ్య నాడు బీడుగా ఉన్న భూముల్లో నేడు పసిడి పం**టలు పండుతున్నాయి. వ్యవసాయంతో పాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో రాజన్న తమ కుటుంబాల్లో వెలుగులు నింపారంటూ మెట్ట ప్రాంత రైతులు తమ ఇళ్లల్లో పెట్టుకున్న వైఎస్ ఫొటోలు ఇప్పటికీ దర్శనమిస్తూనే ఉంటాయి.

సాగునీటి గలగలలు

- వైఎస్సార్ సీఎం అయ్యాక మెట్ట ప్రాంతంలో బంగారు పంటలు పండేలా అనేక పథకాలు చేపట్టారు. రంపచోడవరం మన్యంలో ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా గోకవరం మండలంలో సుమారు 15 వేల ఎకరాలకు జలయజ్ఞం ద్వారా సాగునీరు అందించిన ఘనత వైఎస్‌దే. ఏటా ఒక పంట కూడా పండించలేని ఆ భూముల్లో నేడు రెండు పంటలకు సైతం సాగునీరు సమృద్ధిగా అందుతోంది. 2004 ఎన్నికలకు ముందు గోకవరం వచ్చిన వైఎస్.. రైతుల కగడండ్లు కళ్లారా **చూశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 22 వేల ఎకరాలకు సాగునీరందిస్తానని గోకవరం బహిరంగ సభలో మాట ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి సీఎం అయ్యాక ఏడాది తిరగకుండానే రూ.205 కోట్లతో ముసురుమిల్లి ప్రాజెక్టు** పనులకు శ్రీకారం చుట్టారు.
- కేంద్రంతో పోరాడి తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకాన్ని పట్టాలెక్కించి, బీడువారిన భూముల్లో పంట సిరులు కురిపించారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద నిర్మించిన పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా అక్కడి నుంచి తుని వరకూ 1.50 లక్షల ఎకరాలకు రెండు పంటలకూ సాగునీరందించి, మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు.
- కాకినాడ, విశాఖ జిల్లాల్లో 50 వేల పైచిలుకు భూములకు నేడు పుష్కలంగా సాగునీరందేలా తాండవ ప్రాజెక్టు ఆధునీకరణ పనులు వైఎస్ హయాంలోనే పట్టాలెక్కాయి. మట్టి కాలువల స్థానంలో కాంక్రీట్ కాలువలు నిర్మించారు. తద్వారా రైతులకు నీటి సమస్య అనేదే లేకుండా చేశారు.
- **ఏలేరు రిజర్వాయర్ పరిధిలో 67 వేల ఆయకట్టు ఉండేది. వరదల సమయంలో ముంపు, నీటి ఎద్దడి సమయంలో కరవుతో ఏలేరు రైతులు అల్లాడిపోయేవారు. 24 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ ఆధునీకరణకు వైఎస్సార్ 2009లో రూ.132 కోట్లు కేటాయించారు.**
- పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) దశను మార్చేందుకు రూ.120 కోట్లు మంజూరు చేశారు.

ప్రగతి జాడలివిగో..

- కాకినాడ నగరంలో కల్పనా సెంటర్ – ఆర్టీసీ కాంప్లెక్స్ ఫ్లై ఓవర్ నిర్మాణం వైఎస్సార్ చలవే. ఈ ఫ్లై ఓవర్ కోసం ఎన్నో ఏళ్లుగా ఎంతో మంది ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. చివరకు ఈ సమస్యను అప్పటి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో నగర ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు తెర పడింది.
- అలానే సాంబమూర్తినగర్ ఫ్లై ఓవర్ కూడా మహా**నేత వైఎస్ చలవే**. దీని నిర్మాణం ఫలితంగా నేడు **రాజీవ్ గృహకల్ప**, పోర్టు ఏరియాకు ప్రయాణం **సాఫీగా సాగిపో**తోంది.
- **కాకినాడ నగరం**తో పాటు పెద్దాపురంలో రాజీవ్ **గృహకల్ప నిర్మా**ణం చేపట్టి, వేలాది పేద కుటుంబాలకు సొంతింటి కలను వైఎస్సార్ సాకారం చేశారు.
- సముద్ర కోతకు గురవుతున్న ఉప్పాడ తీర ప్రాంతాన్ని రక్షించేందుకు వైఎస్ రాజశేఖరరెడ్డి జియో ట్యూబ్ రక్షణ గోడను నిర్మించారు. తద్వారా ఇప్పటికీ అక్కడి మత్స్యకారుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.
- తుని వద్ద తాండవ నదిపై భూమి, మురా మినీ ఆనకట్టలను రూ.5 కోట్లతో నిర్మించారు. తుని పట్టణ ప్రజలకు ఇప్పుడు గుక్కెడు నీరు అందుతోందంటే నాడు వైఎస్ చేసిన కృషే కారణమని అక్కడి ప్రజలు ఇప్పటికీ చెబుతారు.
- రాష్ట్రంలోనే జంట మున్సిపాలిటీలుగా ఉన్న సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లోని ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.15 కోట్లు మంజూరు చేసి వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేయించారు.

బీడు భూములు బంగారమయ్యాయి



వైఎస్ సీఎం కాకముందు మా ప్రాంతంలోని పొలాలకు ఒక్క పంటకు కూడా పూర్తిగా నీరందక బీడు వారేవి. వైఎస్ సీఎం అయిన తరువాత జలయజ్ఞంలో భాగంగా ఏజెన్సీలో నిర్మించిన ముసురుమిల్లి ప్రాజెక్టు వలన మా ప్రాంతానికి సమృద్ధిగా నీరందుతోంది. ఈ నీటిపై ఆధారపడి నేను 23 ఎకరాలు సాగు చేస్తున్నాను. వైఎస్ చలవతో ప్రస్తుతం రెండు పంటలకు నీరందుతోంది.

– **కమ్మిల వీరబాబు**, రైతు, గాదెలపాలెం, గోకవరం మండలం

పంటలు పండుతున్నాయ్



గతంలో బోరు నీటితో పంట సాగు చేసుకునే వాళ్లం. దిగుబడి తక్కువగా ఉండేది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పుష్కర ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. అప్పటి నుంచీ పంటలు బాగా పండుతున్నాయి. ఎత్తిపోతల పథకం రాక ముందు బోర్లు ఉన్నప్పటికీ నీరు అంతంత మాత్రంగానే వచ్చేది. పుష్కర పథకం వచ్చిన తరువాత ఇప్పుడు బోర్ల నుంచి కూడా నీరు కూడా బాగా వస్తోంది. పంటలు పుష్కలంగా పండుతున్నాయి.

– **ఒబిన్ని రామదాసు**, తాళ్లూరు, గండేపల్లి మండలం

నాకు ఎనిమిదెకరాల పంట భూమి ఉంది



తాండవ ప్రాజెక్టు నుంచి కోటనందూరు మండలానికి నీరు వదిలేవారు. మట్టి కాలువలు కావడంతో పొలాలకు నీరందాలంటే 10 నుంచి 15 రోజులు పట్టేది. రాజశేఖరరెడ్డి హయాంలో మట్టి కాలువలను రూ.55 కోట్లతో సీసీ కాలువలుగా అభివృద్ధి చేశారు. దీంతో పంటలకు నీరు త్వరగా, సమృద్ధిగా అందుతోంది. దిగుబడి బాగుంటోంది. రైతులందరూ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన అభివృద్ధితో చల్లగా ఉన్నారు.

– **అంకంరెడ్డి శ్రీను**, అల్లిపూడి, కోటనందూరు మండలం

దార్శనికుడు



మహానేత రాజన్న దార్శనికుడు. నేడు తుని పట్టణ ప్రజల దాహం తీరుతోందంటే అందుకు కారణం మహానేత వైఎస్ చలవే. నాడు ఆయన ముందు చూపుతో మంచినీటి ట్యాంకులు నిర్మించబట్టే ఈ రోజు మండు వేసవిలోనూ దాహం కేకలు లేకుండా పోయాయి. తాండవ ఆధునీకరణ రాజశేఖరరెడ్డి హయాంలో మరో మణిహారంగా నిలిచిపోయింది. భవిష్యత్ తరాలు కూడా తాండవ ప్రగతిని గుర్తుంచుకోవడం ఖాయమని చెప్పొచ్చు. అంతలా తాండవ ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు.

– **దాడిశెట్టి రాజా**, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

గరళకంఠునికి దశ సహస్ర ఘటాభిషేకం



అభిషేకానికి నీళ్ల బిందెలతో బారులు తీరిన భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రసిద్ధిగాంచిన ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో 49 సంవత్సరాలుగా సంప్రదాయంగా వస్తున్న సహస్ర ఘటాభిషేకం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ సేవా కమిటీ సభ్యులు, అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు, పండిత బృందం ఆదిత్యశర్మ, షణ్ముఖశర్మ, కారుణ్యశర్మ, కార్తీక్‌శర్మ, దిలీప్‌శర్మ తదితరులు స్వామివారికి మహన్యాస పూర్వకంగా 11 రుద్రాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గర్భాలయానికి చెక్కలు అడ్డం పెట్టి భక్తులు 10 వేల బిందెలతో తెచ్చిన జలాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. శివలింగంపై ఉన్న గంగాదేవి మూర్తి మునిగేంత వరకూ ఈ అభిషేకం చేశారు. దశ సహస్ర ఘటాభిషేకం వలన వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని భక్తులు నమ్ముతారు. గ్రామంలోని మహిళలతో పాటు ఇతర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కూడా గ్రామంలోని చెరువు నుంచి బిందెలతో నీళ్లు తెచ్చి స్వామి వారికి సమర్పించారు. ఉదయం 9 గంటల నుంచి మహిళా భక్తులు బారులు తీరి అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



జలదిగ్బంధంలో స్వామి వారు

కూటమి సర్కారు.. కూకటి వేళ్లతో కదిలేలా..

- గొల్లప్రోలులో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- బాబు మోసంపై విరుచుకుపడ్డ నేతలు
- పార్టీ విస్తృత స్థాయి సమావేశం సూపర్ సక్సెస్



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, వేదికపై ఇతర నేతలు



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

పిఠాపురం: కూటమి ప్రభుత్వం కూకటి వేళ్లతో కదిలేలా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వేలాదిగా కదం తొక్కారు. సీఎం చంద్రబాబు మోసంపై విరుచుకుపడ్డారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమానికి శ్రేణులను సమాయత్తం చేసే లక్ష్యంతో.. వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్ అధ్యక్షతన గొల్లప్రోలులో సోమవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశం సూపర్ సక్సెస్ అయ్యింది. నేతల ప్రసంగాలు స్థానిక నాయకులు, కార్యకర్తల్లో ఉత్తేజం నింపాయి.

అబద్ధాల్లో బాబును మించిన కొడుకు

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, ఏ తండ్రి అయినా కొడుకు తన కంటే ప్రయోజకుడు కావాలని కోరుకుంటారని, కానీ, అబద్ధాలు ఆడటంలో చంద్రబాబు కొడుకు మాత్రం తండ్రిని మించిన తనయుడిలా ఉన్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 100 అబద్ధాలు ఆడితే, ఆయన కుమారుడు లోకేష్ 200 అబద్ధాలు ఆడుతూ తండ్రిని మించిపోయారని అన్నారు. ఏప్రిల్, మే నెలల్లో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని మంత్రి లోకేష్ శాసన మండలి సాక్షిగా చెప్పారని, జూన్ వెళ్లి జూలై వచ్చినా ఇంకా అమలు కాలేదని బొత్స దుయ్యబట్టారు. ఇలాంటి అబద్ధాలు ఆడేవారిని మోసగాళ్లు, దగాకోరులు అనాలా, వద్దా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట మార్చి ప్రజల్ని మోసం చేశారని దుయ్యబట్టారు. జరిగిన మోసాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే తాటా తీస్తానని చంద్రబాబు.. మక్కెలు విరగ్గొడతానని పవన్ కల్యాణ్ అంటున్నారన్నారు. వాళ్ల తాట తీసి, మక్కెలు విరగ్గొడితే కొట్టించుకోడానికి వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలేమైనా చేతకానివారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పథకాలు ఇస్తామని మోసం చేసిన చంద్రబాబు, పవన్ మోసగాళ్లు కాదా? అబద్ధపు వాగ్దానాలు చేసిన వీరిద్దరూ అబద్ధపుకోరులు కాదా?' అని బొత్స ప్రశ్నించారు. దమ్ముంటే ఈ ఇద్దరు నాయకులూ గ్రామాలకు వెళ్లి, తాము ఇచ్చిన హామీలపై ప్రజలతో మాట్లాడాలని, ఎవరు ఎవరి తాట తీస్తారో, ఎవరి మక్కెలు ఎవరు విరగ్గొడతారో అప్పుడు తెలుస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఈవిధంగా బెదిరించడం భావ్యమేనా అని ప్రశ్నించారు. చేసే సత్తా లేనప్పుడు వాగ్దానాలు ఎందుకిచ్చారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అడిగే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అడిగిన వారిని అణగదొక్కుదామంటే ఇంకా పైకి లేచి మరింత తిరగబడతారని హెచ్చరించారు. చంద్రబాబు, పవన కల్యాణ్ కలసి పలు హామీలిచ్చి అమలు చేస్తామంటూ ప్రజలకు బాండు రాసిచ్చారన్నారు. ఇప్పుడు ఆ బాండ్లను ప్రజలకు చూపించి, వారిద్దరూ చేసిన మోసాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ప్రతి కార్యకర్తా ప్రతి గ్రామంలోనూ ఇద్దరు నేతల మోసాలను వివరించి, ప్రజలను చైతన్యపరచాలని బొత్స పిలుపునిచ్చారు. మేనిఫెస్టోను కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేసేంత వరకూ రాష్ట్రంలో 40 శాతం ఓట్ షేర్ కలిగిన బలమైన ప్రతిపక్షంగా ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని, పోరాడుతూనే ఉంటామని చెప్పారు. దీనిని అధికార పక్షం విస్మరిస్తే మెడలు వంచి మరీ గుర్తు చేసే బాధ్యత వైఎస్సార్ సీపీపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రతి నాయకుడు, కార్యకర్త కూటమి మేనిఫెస్టో అమలు చేసేంత వరకూ ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేస్తూ పోరాడాలని బొత్స అన్నారు.

విచ్చలవిడిగా గంజాయి, మద్యం

పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి, గ్రామాల్లో ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయని, మద్యం ఏరులై పారుతోందని అన్నారు. కొన్ని పత్రికల్లో మాత్రం 'గంజాయి రహిత రాష్ట్రంగా మారింది' అంటూ రాయడం హాస్యాస్పదంగా ఉందని దుయ్యబట్టారు. గంజాయి వ్యాపారంలో ఆరితేరింది వాళ్ల నాయకులేనని, ఎకరానికి ఇంత అని కమీషన్లు తీసుకుని, గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. పేపర్లలో రాయించుకోవడంపై పెట్టిన దృష్టి గంజాయి నిర్మూలనపై పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూచించారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం అన్ని హామీలూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు కలసి వచ్చి ప్రమాణం చేసి హామీలు అమలు చేస్తామన్నారు కాబట్టే ప్రజలు నమ్మి కూటమికి ఓట్లు వేశారన్నారు. చివరికి మోసపోయామంటూ అన్ని వర్గాల ప్రజలూ ప్రభుత్వంపై తిరగబడే రోజులు వచ్చేశాయని చెప్పారు. ఎన్నో ప్రలోభాలు, ఆశలు పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ కేడర్‌ను లాక్కునే ప్రయత్నం చేసినా ఏ ఒక్కరూ కూటమి పార్టీల వైపు చూడలేదని, అధినేత వైఎస్ జగన్, వంగా గీతలపై ఉన్న నమ్మకమే దీనికి కారణమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ కూటమి ప్రభుత్వం నెరవేర్చేంత వరకూ పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజా అన్నారు.

ఆదర్శంగా తీసుకోవాల్సింది వారిని..

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ, వంగవీటి మోహనరంగా, ముద్రగడ పద్మనాభం, బొత్స సత్యనారాయణ, వంగా గీతా విశ్వనాథ్ వంటి కాపు నేతలు ప్రజల కోసం పని చేసిన వారని అన్నారు. యువత ఇలాంటి నేతలను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఒక సినీ హీరోను ఆదర్శంగా తీసుకుని, ఆయన వెనుక తిరుగుతున్న వారు ఒకసారి దీనిపై ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. పవన్ కల్యాణ్ తాను ముఖ్యమంత్రి కావడం కోసం పని చేస్తున్నారా.. లేక మామకు వెన్నుపోటు పొడిచిన, రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడానికి కారకులైన వ్యక్తిని సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా చూసేందుకు పని చేస్తున్నారా అనేది ఆయన వెనుక ఉన్న వారు ఆలోచించుకోవాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు చేస్తున్నారని చెప్పారు. ఇవన్నీ పవన్ కల్యాణ్‌కు కనిపిస్తున్నాయా అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో గాజువాక ప్రజలు ఎడమ కాలితో, భీమవరం ప్రజలు కుడి కాలితో తంతే 2024 ఎన్నికల్లో పిఠాపురం వచ్చి పడిన పవన్ కల్యాణ్‌ను పిఠాపురం ప్రజలు పెద్ద మనసుతో శాసన సభకు పంపించారన్నారు. డిప్యూటీ సీఎంగా ఉన్న ఆయన రాష్ట్రానికి, జిల్లాకు లేదా పిఠాపురం ప్రాంతానికి గడచిన ఏడాది కాలంలో ఏం చేశారని చూస్తే గుండుసున్నా కనిపిస్తుందన్నారు. వేలాది మంది మహిళలు అదృశ్యమవుతున్నారంటూ ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీపై, వలంటీర్ వ్యవస్థపై బురద జల్లిన పవన్.. అధికారం చేపట్టిన ఈ ఏడాది కాలంలో ఎంతమందిని వెనక్కి తీసుకొచ్చారో చెప్పగలరా అని రాజా ప్రశ్నించారు. వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పార్టీకి కట్టుబడి, ప్రలోభాలకూ లొంగకుండా బలమైన కేడర్‌గా ఉన్నారని కొనియాడారు. మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడుతూ, పిఠాపురంలో జనసేన విజయం తర్వాత వైఎస్సార్ సీపీ ఖాళీ అంటూ తప్పుడు ప్రచారం చేశారని, కానీ, వంగా గీత సారథ్యంలో పార్టీ చాలా బలంగా ఉందనడానికి ఈ సమావేశానికి పోటెత్తిన జనమే నిదర్శనమని అన్నారు. సమావేశంలో పార్టీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు దాట్ల సూర్యనారాయణరాజు, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ముద్రగడ గిరిబాబు, దవులూరి దొరబాబు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, మాజీ ఎంపీ గిరిజాల స్వామి నాయుడు, నేతలు కర్రి పాపారాయుడు, యనమల కృష్ణుడు, మాకినీడి శేషకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పిఠాపురం సోషల్ మీడియా గ్రూపులు హ్యాక్!

పిఠాపురం: తమ సోషల్ మీడియా గ్రూపులను కూటమి నాయకులు హ్యాక్ చేశారని పిఠాపురం వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. గొల్లప్రోలులో జరిగిన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి వచ్చిన జనాదరణను సహించలేక కూటమి నాయకులు.. తమ సోషల్ మీడియా గ్రూపులకు ఏపీకే ఫైల్స్ పంపించారని తెలిపారు. తమ సోషల్ మీడియా ప్రతినిధులు అప్రమత్తమై గ్రూపులను పునరుద్ధరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను అణగదొక్కే కుట్రగా అనుమానం వ్యక్తం చేశారు.

డ్రైవింగ్‌కు లైసెన్స్ ముఖ్యం

- చదువు కోసం పోతూ చావు కొని తెచ్చుకోవద్దు
- కళాశాలకు బైక్‌పై ప్రయాణం ప్రమాదకరం
- ఆకతాయి పనులతో అనర్థం
- సురక్షిత ప్రయాణంతో మంచి భవిష్యత్తు



మండపేటలో 2024 ఫిబ్రవరి 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి (ఫైల్)

కపిలేశ్వరపురం: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు నెలకావొస్తోంది. ఫలితాల వెల్లడి, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు తీసుకోవడం, పై చదువులకు కళాశాలను ఎంచుకోవడం, అడ్మిషన్ తీసుకోవడం తదితర ప్రక్రియలతో జూన్ నెల బిజీ బిజీగా సాగింది. ఇక నుంచి పాఠ్యాంశాల బోధన, అంతర్గత స్థాయి పరీక్షల నిర్వహణ తదితర వాటితో విద్యార్థులు చదువుల్లో తలమునకలు అవుతారు. కళాశాలకు వెళ్లడం ఎంత అవసరమో ఆ ప్రయాణం సురక్షితంగా సాగేలా జాగ్రత్తలు తీసుకోవడమూ అంతే అవసరం. సురక్షిత ప్రయాణం ఆవశ్యకతపై ఈ కథనం...

పిల్లలకు వాహనాలిస్తే తండ్రిపై క్రిమినల్ కేసు

సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్, వెహికల్ డ్రైవింగ్ రూల్స్ రూపొందించారు. సినిమాలో హీరో తరహాలో వాహనాన్ని నడపాలన్న తపన వెనుక ప్రాణహాని పొంచి ఉందని గ్రహించాలి. పదో తరగతి , ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వారి వయసు రీత్యా వాహనాన్ని నడిపే అర్హత ఉండదు. 18 ఏళ్లు నిండిన వారు లైసెన్స్ లేకుండా ప్రయాణాలు చేయడం సరికాదు. అలా చేస్తే రూ.5వేల నుంచి రూ.10వేల వరకూ జరిమానా విధిస్తారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి. అతిక్రమించి ఇచ్చినట్టయితే తండ్రిపై కేసు నమోదు చేస్తారు. నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. వాహనాలను నడిపేటప్పుడు నిర్లక్ష్యాన్ని విడనాడాలి. టూ వీలర్‌పై ముగ్గురు ప్రయాణం చేయడమంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాన్ని నడపడం నేరం.

గతంలో ప్రమాదాలకు గురైన విద్యార్థులిలా...

- 2024 ఫిబ్రవరి 15న మండపేట మెహర్ బాబా ఆశ్రమం సమీపంలో లారీ ఢీకొని పట్టణంలోని ప్రైవేటు కళాశాలలోని సెకండ్ ఇంటర్ విద్యార్థి పడాల మధుసాయి మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు.
- 2023 ఫిబ్రవరి 26న అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెం శివారు టి.సావరం వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అమలాపురంలోని కళాశాలకు ప్రాక్టికల్ పరీక్షకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తున్న నందెపు రాజేష్ (17), అల్లపల్లి నాగేంద్ర (17) మృతిచెందారు.
- 2023 జూన్ 3న అమలాపురం మండలం నడిపూడికి చెందిన పదో తరగతి విద్యార్థి పెనుమల ప్రశాంతి (06) నడిపూడిలో మట్టి ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది.
- 2023 మే 19న అమలాపురం మహిపాల వీధికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని గంగా లక్ష్మీ జాహ్నవి (11) గాంధీనగర్ వద్ద మట్టి ట్రాక్టర్ ఢీకొని అదే రోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.
- 2023 డిసెంబర్ 3న మండపేట పట్టణంలోని మారేడుబాక వంతెన వద్ద కారు ఢీకొని మారేడుబాక గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి మాడెం ప్రవీణ్ (11) మృతిచెందాడు.

నిబంధనల పర్యవేక్షణకు సహకరించాలి

రహదారులపై వెహికల్ డ్రైవింగ్ రూల్స్ పాటించడంపై అధికారులు తనిఖీలు చేస్తుంటారు. వారికి విద్యార్థులు విధిగా సహకరించాలి. లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపాలన్న ఆలోచన విడనాడాలి. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో పోలీసుల కళ్లు గప్పి ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లిపోవాలన్న ఆలోచన సరికాదు. విద్యార్థులను ఆటోలో తరలించేవారు 10 కిలోమీటర్ల లోపు ఉన్న విద్యాసంస్థలకు మాత్రమే తీసుకెళ్ళాలి. ఆటో నడిపే కార్మికుని పక్కన ప్రయాణికులు కూర్చోకూడదు. ఆటోకు రెండు వైపులా రక్షణ కవచం ఉండాలి. డ్రైవర్‌కు లైసెన్స్, వాహనానికి పర్మిట్ తప్పనిసరి.

ఆకతాయి పనులు సైతం అనర్థాలను తెస్తాయి

విద్యార్థులు నదిలో స్నానాలకు దిగడం, జనావాసాల్లో రాళ్లు, కర్రలు విసరడం, వాహనాలను వంకరటింకరగా నడపడం వంటి ఆకతాయి పనులకు పాల్పడటం అనర్థం తెచ్చే ప్రమాదం ఉంది. 2023 మే 21న ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన అయినవిల్లి మండలం పెద్దిపాలెంనకు చెందిన ఇంటర్ విద్యార్థి మోటూరి త్రిలోక్(17), కొత్తపేట సాయిబాబా మందిర సమీప నివాసితుడైన నర్సరీ కూలి గెద్దం కరుణకుమార్ (22) మృతిచెందారు. వారి స్నేహితుడు కోరుమిల్లికి చెందిన అయినవిల్లి భవానీశంకర్ పుట్టినరోజును జరుపుకున్న తర్వాత వారు నదిలో స్నానానికి వెళ్లారు.

సామాజిక బాధ్యతగా వ్యవహరించాలి



విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సామాజిక బాధ్యతగా వ్యవహరించాలి. సినిమా, సోషల్ మీడియా ప్రభావాలతో వాహనాలను నడపాలని కానీ, వేగంగా నడపాలని కానీ అనుకోవడంలోనే ప్రమాదం పొంచి ఉంది. రహదారిపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. అతిక్రమిస్తే వాహనం నడిపేవారి ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. మరెవరినైనా ఢీకొంటే క్రిమినల్ కేసుల్లో ఇరుక్కొనే ప్రమాదమూ ఉంటుంది.

– పి.దొరరాజు, సీఐ, మండపేట రూరల్

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు నూకరాజు(ఫైల్)

తుని: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక జీఆర్పీ ఎస్సై జీ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీ మాడుగుల మండలం, కుమ్మరికిమ్ముడుపల్లికి చెందిన బోనంగి నూకరాజు(50) తుని రైల్వే స్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌పారం నుంచి ఒకటో నంబరు ప్లాట్‌ఫారానికి వెళ్లడానికి పట్టాలు దాటుతుండగా విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే రైలు ఢీకొట్టింది. దీంతో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత...

కరప: ఇంట్లో వంట చేస్తుండగా విషసర్పం కాటువేయగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందింది. కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన బోనంగి లోవతల్లి(31) ఈనెల 3వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో వంట చేస్తుండగా ఒక విషసర్పం కాటువేసింది. వెంటనే ఆమెను చికిత్సకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆమె చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలు లోవతల్లి భర్త ప్రసాద్‌కు మధ్య గొడవలు జరిగి ఏడాది కాలంగా గురజనాపల్లిలో తల్లితో పాటు ఉంటోంది. ఆమెకు 8 ఏళ్ల క్రితం వివాహం కాగా 2 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. ఆమె సోదరి రాచకొండ శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్‌ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరుణాచల క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ

- అట్టహాసంగా 63 మంది నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ
- హాజరైన ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు, రాజకీయ నేతలు



రాచపల్లి అరుణాచల క్షేత్రంలో నాయనార్ల విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



సభలో ప్రసంగిస్తున్న ధర్మపురి ఉత్తర పీఠాధిపతి సుక్కా స్వామీజీ

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అరుణాచల మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన 63 మంది నాయనార్ల ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిరువణ్ణామలై అరుళ్లిగు అరుణాచలేశ్వర స్వామి వారి దేవస్థానం అర్చకులు డాక్టర్ టి.అరుణాచల కార్తికేయ శివాచార్య వైభవంగా నిర్వహించారు. వీటితోపాటు దక్షిణామూర్తి విగ్రహాన్ని జెట్టి శివకుమార్ దంపతులు, లక్ష్మీ హయగ్రీవుడు విగ్రహాన్ని శ్రీహరి రాజబాబు దంపతులు, సూర్యభగవానుడు విగ్రహాన్ని దంతులూరి సుభద్రరామరాజు దంపతులు, కాలబైరవుడు విగ్రహాన్ని గిరిధరరెడ్డి దంపతులు, గంగామాత విగ్రహాన్ని బలభద్రుడి సత్యనారాయణ దంపతుల ఆర్థిక సహాయంతో ప్రతిష్ఠించారు. అనంతరం కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శివ నామ స్మరణతో ఆలయ ప్రాంగాణం మార్మోగింది. రాచపల్లి వెళ్లే ప్రధాన రహదారి భక్తులతో కిక్కిరిసిపోయింది.

భక్తి మార్గమే శరణ్యం

భక్తిమార్గమే అందరికీ శరణ్యమని తద్వారా ముక్తికి మార్గం లభిస్తుందని ధర్మపురి ఉత్తర పీఠాధిపతి సుక్కా స్వామిజీ అన్నారు. అరుణాచలక్షేత్రంలో 63 మంది నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక వేత్త అరుణాచల మాధవి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తమిళనాడులో 5–10 శతాబ్దాల మధ్య కాలంలో నివసించిన గొప్ప శివ భక్తులే ఈ నాయనార్లని చెప్పారు. వీరు భక్తి మార్గం ద్వారా మోక్షసిద్ధి పొందినట్లు తెలిపారు. నాయనార్లలో రాజుల నుంచి మానవుల వరకు ఉన్నారని తెలిపారు. భగవంతుడిని చేరడానికి నిష్కలమషమైన భక్తి తప్ప ఇంకేదీ అవసరం లేదన్నారు. సభలో సమన్వయ సరస్వతి, వాగ్దేవి వరపుత్ర బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ, కృష్ణాజిల్లా, పెదపులిపాక విజయ రాజేశ్వరి దేవస్థానం పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామీజీ, శ్రీరమణాసేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానందతో పాటు పలువురు ఆధ్యాత్మిక వేత్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్రమాధవ్, జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్, ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఈ దొంగకు హీరో మోటారు సైకిళ్లు ఇష్టం!

- నిందితుడి అరెస్ట్, 16 బైక్‌ల రికవరీ
- వీటి విలువ రూ.6 లక్షలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

తుని: విలాసాలకు అలవాటు పడిన పాత నేరస్తుడు ఒకే కంపెనీ మోటారు సైకిళ్లను దొంగలించడం అలవాటుగా చేసుకుని చివరికి పోలీసుల చేతికి చిక్కాడు. 16 హీరో మోటారు సైకిళ్లను వేర్వేరు ప్రాంతాల్లో చోరీ చేశాడు. జిల్లా ఎస్పీ బిందుమాదవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో తుని పోలీసులు పెట్టిన నిఘాకు దొంగ చిక్కాడు. తుని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ గీతా రామకృష్ణ కేసుకు సంబంధించిన వివరాలను తెలియపరిచారు. అల్లూరి మన్యం జిల్లా రాజవొమ్మంగి మండలం జె.వనకరాయి గ్రామానికి చెందిన గూడవల్లి అప్పారావు ప్రసాద్ తుని అర్ అండ్ బీ గెస్ట్ హౌస్ సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. నిందితుడుపై గతంలో కేసులు ఉన్నాయి. తుని టౌన్, అన్నవరం, సామర్లకోట, పెద్దాపురం, రాజమండ్రి ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 16 మోటారు సైకిళ్లను చోరీ చేశారు. వీటి విలువ రూ.6 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఒకే కంపెనీకి చెందిన మోటారు సైకిళ్లను చోరీ చేయడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు. కేసును ఛేదించిన తుని పట్టణ ఎస్సై జె.విజయ్ బాబు, కానిస్టేబుల్స్ నాయుడు, కిరణ్, పెద్దాపురం ఇన్‌స్పెక్టర్ ఆర్.అంకబాబు, ఏఎస్సై శ్రీహరి, హెచ్‌సీ నారాయణమూర్తి, రాధాకృష్ణలను జిల్లా ఎస్పీ బిందుమాదవ్ అభినందించారు.

హుండీ దొంగకు రిమాండ్

కరప: మండలం నడకుదురులోని వేంకటేశ్వర స్వామి గుడిలోని హుండీని దోచుకుపోయిన దొంగ పోలీసులకు చిక్కాడు. సదరు దొంగను కాకినాడ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. నడకుదురు గ్రామంలోని శివాలయంవీధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి గుడిలో ఈ నెల 3వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి, హుండీ తాళం బద్దలుకొట్టి అందులోని రూ.3 వేల నగదు దోసుకుపోయినట్టు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విదితమే.. దొంగతనం కేసు నమోదు చేసిన కరప ఎస్‌ఐ టి.సునీత, ఏఎస్‌ఐ వి.సూరిబాబుతో కల్సి దర్యాప్తు చేసి సోమవారం సదరు నిందితుడు తూరంగి గ్రామ నివాసి తిక్క అంజి అనే బొడ్డు అంజిబాబును అరెస్టుచేసి, అతనివద్ద నుంచి హుండీ సొమ్ము రూ.3.060 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ సునీత తెలిపారు.

ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో అవకతవకలు

- స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్‌కు ఫిర్యాదు
- ఫెన్సింగ్ క్రీడాకారుడు గౌతమ్‌రాజ్



స్పోర్ట్స్ అథారిటీ వైస్‌చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న గౌతమ్‌రాజ్

సామర్లకోట: సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్ స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని స్థానిక ప్రముఖ ఫెన్సింగ్ క్రీడాకారుడు ఎం గౌతమ్‌రాజ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్‌చైర్మన్‌కు వినతి పత్రం అందజేశానన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నీట్ పరీక్ష రాసే అభ్యర్థి పేరుపై మరొకరు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారన్నారు. దాంతో స్పోర్ట్స్‌లో కనీస పరిజ్ఞానం లేని వారు స్పోర్ట్స్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సంపాదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో ప్రాతినిధ్యం వహించని వారికి నకిలీ ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. సాఫ్ట్‌బాల్ ఆటకే పరిమితం కాకుండా ఫెన్సింగ్ ఆటలోనూ ఇదే విధంగా జరుగుతోందన్నారు. ఫెన్సింగ్ ఆటను ముసుగు ధరించి ఆడటం వలన ఎవరు ఆడుతున్నారో తెలియడం లేదన్నారు. దీనిని ఆసరాగా తీసుకొని దందా జరుగుతోందని చెప్పారు. విద్యార్థులను క్రీడలలో ప్రాత్సహించవలసిన ఫెన్సింగ్ అసోసియేషన్ క్రీడాస్ఫూర్తిని అణగదొక్కుతోందన్నారు. దొడ్డిదారిలో ఎంబీబీఎస్ సీట్లు సాధిస్తున్న వారిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని గౌతమ్‌రాజ్ కోరారు.

బంధాన్ని కాదని.. అనుబంధాన్ని తెంచుకుని..

- రైలు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు
- తండ్రిని వద్దంటున్న కుమారుడు.. తనకు భర్త లేడంటున్న భార్య



వృద్ధుడు సుబ్బారావు



తణుకు ఆస్పత్రిలో సుధీర్‌రాజుకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్‌ఎంఓ తాతారావు

తణుకు అర్బన్: వివాహ బంధాన్ని భార్య వద్దంటోంది. కన్నతండ్రితో అనుబంధాన్ని కుమారుడు తెంచుకుంటున్నాడు. ఏడేళ్ల క్రితం తెగిపోయిన రక్తసంబంధం నేడు ఎదురైనా తమకు వద్దంటే వద్దని ఆ కుటుంబం తెగేసి చెబుతోంది. దీంతో ప్రమాదవశాత్తూ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు అల్లాడుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన కలగర సుబ్బారావు ఏడేళ్ల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. ఆదివారం కాల్దారి స్టేషన్‌లో రైలు నుంచి జారిపడగా రైల్వే పోలీసులు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడిని ఆరా తీయగా కుటుంబ సభ్యుల వివరాలు తెలిపారు. రైల్వే కానిస్టేబుల్ బాల విషయాన్ని వృద్ధుడి కుమారుడు సుధీర్‌రాజుకు ఫోన్ ద్వారా తెలియజేయగా తనకు నాన్న అవసరం లేదని తెగేసి చెప్పాడు. అయినా కానిస్టేబుల్ బాల ప్రకాశరావుపాలెంలోని ఇంటికి వెళ్లి వృద్ధుడి భార్యతో విషయం చెప్పగా తన భర్త ఎప్పుడో చనిపోయాడని, అతడి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని వితంతు పింఛను కూడా పొందుతున్నట్టు సమాధానం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ఆశ్చర్యపోయారు.

కేసు నమోదు చేసినా ఇబ్బంది లేదు

సుధీర్‌రాజును ఎట్టకేలకు రైల్వే పోలీసులు తణుకు ఆస్పత్రికి తీసుకురాగా సోమవారం ఆర్‌ఎంఓ డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావు కౌన్సెలింగ్ ఇచ్చారు. తమకు సుబ్బారావు అవసరం లేదని, అవసరమైతే అలా రాసిస్తామని సుధీర్‌రాజు సమాధానమిచ్చాడు. దీంతో సీఐ ఎన్.కొండయ్య ఆస్పత్రి వద్దకు వచ్చి కన్న తండ్రిపై నిర్లక్ష్యం వహిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించగా.. కేసు నమోదు చేసుకోమని సుధీర్‌రాజు తెగేసి చెప్పాడు. దీంతో చేసేదిలేక ఆస్పత్రి వైద్యులు సుబ్బారావుకు చికిత్స అందిస్తున్నారు.